ఈనాడు
అన్నమయ్య
సోమవారం అక్టోబరు 7, 2024



సిద్దవటం మండలం కొత్తపల్లిలో వాడిపోయిన చెట్టు మళ్లీ చిగురిస్తోందిలా...

సగం పచ్చగా... ఎండగా

ఇటీవల కాలంలో ఏళ్ల నాటి చెట్లు కూడా పూర్తిగా ఆకులు రాలిపోయి ఎండిన కొమ్మలతో దర్శనమిస్తున్నాయి. మరికొన్ని చెట్లు సగం పచ్చగా వుంటే మిగతా సగం వాడిపోయి కనిపిస్తున్నాయి. దీంతో స్థానికులు ఎండిపోయిందని భావించి వాటిని కొట్టేస్తున్నారు. తొలగించకుండా అలానే ఉంచిన చెట్లు మాత్రం వర్షాలకు తిరిగి చిగురించి, మామూలు స్థితికి వస్తున్నాయి. దీనిపై ఊటుకూరు వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త సునీల్‌కుమార్ మాట్లాడుతూ... ఎండలు ఎక్కువైనప్పుడు లేదా టీ-మస్కిటో బగ్ ఆశిస్తే చెట్లు వాడిపోతున్నాయని చెప్పారు. దీని నివారణకు ఇమిడా క్లోఫిడ్ మందును 0.4 ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు. వర్షాలు పడ్డాక తిరిగి కొన్ని చెట్లు చిగురిస్తాయని పేర్కొన్నారు. - ఈనాడు, కడప

జిల్లాకు 6 వేల క్వింటాళ్ల ఉలవలు : మంత్రి

స్పందనకు వందనం

రాయచోటి, న్యూస్‌టుడే: ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న ఉలవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర రవాణా యువజన క్రీడలశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనాడులో 'అవసరం ఎక్కువ... పంపిణీ తక్కువ' శీర్షికన ఈ నెల 2న ప్రచురించిన కథనానికి ఆయన స్పందించారు. జిల్లాకు తొలుత 80 శాతం రాయితీపై 9,500 క్వింటాళ్ల ఉలవలు వచ్చాయని అవి రైతులకు సరిపడకపోవడంతో మరో ఆరు వేల క్వింటాళ్లు అవసరం అవుతాయని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో ఆరు వేల క్వింటాళ్లు అదనంగా మంజూరు చేసిందన్నారు. వర్షాధారం కింద సాగు చేసే ఈ పంటకు అవసరమైన విత్తనాలను తీసుకొని సాగు చేయాలని ఆయన రైతులను కోరారు.

జగజ్జనని... లోకపావని

శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా ఆదివారం జగజ్జనని లలితా త్రిపుర సుందరీదేవిగా దర్శనమిచ్చారు... జిల్లావ్యాప్తంగా శక్తి స్వరూపిణి వివిధ ఆలయాల్లో శ్రీచక్ర అధిష్టానశక్తిగా, పంచ దశాక్షరీ మహా మంత్రాది దేవతగా తనను కొలిచే భక్తులకు దర్శనమిచ్చారు. కుడివైపున లక్ష్మీదేవి, ఎడమ వైపున సరస్వతీదేవి సేవలు చేస్తుండగా చెరకు గడ, విల్లు, పాశాంకుశాలను ధరించి ఎరుపు, నీలం రంగు చీరల్లో జగన్మాత దర్శనమిచ్చారు. అమ్మవారికి రాజభోగం పేరుతో పాయసాన్నం, చక్రాన్నం, పూర్ణాలు, అల్లం గారెలు ఇలా వివిధ రకాల నైవేద్యాలను సమర్పించారు. భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రధాన ఆలయాల్లో అమ్మవారి దేదివ్యరూప చిత్రాలివి. - న్యూస్‌టుడే, అన్నమయ్య బృందం



రాజంపేటలో శ్రీకృష్ణమూర్తి అలంకరణలో వాసవిమాత



పీలేరులో మోహినీ అవతారంలో కన్యకా పరమేశ్వరి



పీలేరులో కోటపల్లెలో గజలక్ష్మీ అలంకరణలో పద్మావతి అమ్మవారు



మదనపల్లె నీరుగట్టువారిపల్లెలో వెండి కవచంతో చౌడేశ్వరీదేవి



రాజంపేట అమ్మవారిశాలలో దర్శనానికి బారులు తీరిన భక్తులు



వీరభద్రాలయంలో రాజరాజేశ్వరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చిన భద్రకాళీదేవి అమ్మవారు

పెద్దిరెడ్డిది శవ రాజకీయాలు

రాష్ట్ర మైనార్టీశాఖ మంత్రి ఫరూక్



మాట్లాడుతున్న మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్, పక్కన ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, నాయకులు

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే: గత వైకాపా హయాంలో రూ.వేల కోట్ల విలువైన భూములను దోచిన మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తాజాగా శవ రాజకీయాలు చేస్తున్నారని రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ ఆరోపించారు. మదనపల్లెకు ఆదివారం వచ్చిన మంత్రి ఫరూక్ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయ దహనం ఘటనలో పలు అనుమానాలు ఉన్నాయని, విలువైన రెవెన్యూ దస్త్రాలు అగ్నికి ఆహుతయ్యాయని పేర్కొన్నారు. ఈ ఘటనలో ఎవరెవరి హస్తం ఉందో స్థానికులు బాగా తెలుసునని స్పష్టం చేశారు. పుంగనూరులో బాలిక మృతి ఘటనలో పెద్దిరెడ్డి నాలుగు రోజుల తర్వాత పత్రికల ముందుకు వచ్చి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. పెద్దిరెడ్డికి బాధిత కుటుంబంపై సానుభూతి ఉంటే ఘటన జరిగిన రోజే ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో పలమనేరులో ఓ బాలిక తరగతిలో మొదటి ర్యాంకు సాధించినందుకు ఆ అమ్మాయిని వైకాపా నాయకులు వేధింపులకు గురిచేసి ఆత్మహత్య చేసుకునేలా చేశారని ధ్వజమెత్తారు. వైకాపా నాయకులు భూమిని ఆక్రమించుకుని వేధింపులకు గురిచేయడంతో కర్నూలులో ఓ మైనార్టీ కుటుంబం రైలుకిందపడి ఆత్మహత్య చేసుకుంటేనే అప్పట్లో అధికారంలో ఉన్న వైకాపా ప్రభుత్వ మంత్రులు, ఎమ్మెల్యేలు కనీసం బాధిత కుటుంబాలను పరామర్శించలేదని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం బాధిత కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకోవడానికి చర్యలు తీసుకుంటుందని తెలిపారు. మైనార్టీల సంక్షేమానికి తెదేపా కృషి చేస్తోందని వివరించారు. వైకాపా ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్న షాదీమహల్ నిర్మాణాలను పూర్తి చేయడానికి కూటమి ప్రభుత్వం అవసరమైన నిధులు మంజూరు చేస్తుందని మంత్రి స్పష్టం చేశారు. సమావేశంలో మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, రాష్ట్ర సమాచారశాఖ మాజీ కమిషనర్ ఇంతియాజ్, మైనార్టీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఫారూక్ షిబ్లీ పాల్గొన్నారు.


నక్కలదిన్నెలో నడవాలన్నా నరకమే



మదనపల్లె పురపాలక సంఘం సరిహద్దు ప్రాంతమైన నక్కలదిన్నెలో రోడ్డుపై వాహనం నడపాలన్నా, నడవాలన్నా నరకంగా మారింది. సిరికల్చర్ కార్యాలయానికి వెళ్లే మార్గంలో మురుగు కాలువలు లేకపోవడంతో ఇళ్ల నుంచి వెలువడే వ్యర్థపునీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. వాహనాల రాకపోకలతో రోడ్డుపై గుంతలుపడ్డాయి. మలుపు ప్రాంతం కావడంతో రాత్రివేళల్లో ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి కిందపడుతున్నారు. దీంతో పాటు వ్యర్థపు నీటి ప్రవాహంతో చుట్టుపక్కల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులకు పలుమార్లు తెలిపినా పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిపై కమిషనర్ ప్రమీల మాట్లాడుతూ రోడ్డు మరమ్మతులు చేపడతామని పేర్కొన్నారు. - న్యూస్‌టుడే, మదనపల్లె గ్రామీణ

బాగుండెదెలా?





ఆగుతున్న యువ హృదయ స్పందనలు

ఆకస్మిక మరణాలతో అంతటా ఆందోళన

జే-బ్రాండ్ మద్యంతోనూ ముప్పు



బి.కొత్తకోట మండలం నాయనబావికి చెందిన శంకర్, రెడ్డెమ్మల కుమారుడు ఆకాశ్ (20) గత నెల 10వ తేదీన గ్రామంలో వినాయకుడి నిమజ్జనంలో పాల్గొని నృత్యం చేస్తూ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. దీంతో స్థానికులు, కుటుంబ సభ్యులు అతన్ని 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే ఆకాశ్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.



మదనపల్లె మండలం వలసపల్లె పంచాయతీ కృష్ణాపురానికి చెందిన కొండప్ప కుమారుడు ప్రశాంత్ (25) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తాడు. ఇతనికి భార్య అనిత, ఇద్దరు పిల్లలున్నారు. గత నెల 12వ తేదీన గ్రామంలో వినాయక నిమజ్జనం సందర్భంగా నృత్యం చేశాడు. అనంతరం ఇంటికి వెళ్లిన అతను ఒక్కసారిగా వాంతులు చేసుకుని మృత్యువాత పడ్డాడు. ఇంటికి పెద్ద దిక్కుగా ఉన్న ప్రశాంత్ మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమౌతున్నారు.

ఇలా ఒకటి కాదు.. రెండు కాదు.. పాతికేళ్లు కూడా నిండని యువత గుండెలు ఆగిపోతుండడం అంతుబట్టని విషయంగా మారింది. నృత్యం చేస్తూ మృతి చెందిన మరికొందరి ఉదంతాలు వెలుగు చూస్తుండడంతో అంతటా ఈ విషయం చర్చనీయాంశంగా మారింది. డీజే వాహనాల వద్ద భరించరాని శబ్దాలు కూడా దీనికి ఒక కారణంగా వైద్యులు చెబుతుండడంతో ఇప్పుడు అందరి దృష్టి వాటిపై పడింది. చిన్న వయస్సులోనే అనంత లోకాలకు వెళ్లిపోతున్న యువతను చూసి తల్లిదండ్రులు మానసికంగా కుంగిపోతున్నారు.

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే

ఎదుగుతున్న బిడ్డలు ఒక్కసారిగా కుప్పకూలిపోతే ఆ తల్లిదండ్రుల మానసిక క్షోభను వర్ణించలేం. బిడ్డల బాగు కోసమే తల్లిదండ్రులు సర్వస్వం ధారబోస్తారు. అలాంటి పిల్లలు మద్యం మత్తుకు అలవాటు పడి, చెడు స్నేహాలతో జీవితాలు నాశనం చేసుకుంటున్నారు. తాము ఆరోగ్యంగా ఉన్నామనుకుంటూనే శరీరం లోపల పెరిగే జబ్బులను నిర్లక్ష్యం చేస్తున్నారు. అధిక శబ్దాలు హృదయ స్పందనపై ప్రభావం చూపుతుండగా, మద్యం మత్తు, నృత్యాలతో గుండెలు ఆగిపోతున్నాయి. యువ గుండెలు ఆగి ఆ కుటుంబ సభ్యులు గుండెలు పగిలేలా చేస్తున్నాయి. యువత ప్రవర్తన, జీవన విధానంలో మార్పు రావాలని వైద్యులు అంటున్నారు.

పెద్ద పెద్ద శబ్దాలతో అనర్థం

- సాధారణ మానవుడి గుండె నిమిషానికి 60 నుంచి 100 సార్లు కొట్టుకుంటుంది. అదే వ్యాయామం లేదా కసరత్తులు, పనులు చేసినప్పుడు ఆ వేగం 170 నుంచి 180 సార్లకు చేరుకుంటుంది. శరీరంలో హార్మోన్లు, న్యూరో కెమికల్స్‌లో వచ్చే మార్పుల వల్ల రక్తపోటు, కొవ్వు, చక్కెర స్థాయిలు ఉన్న వారికి 180 నుంచి 200 సార్లు కొట్టుకుంటుందని వైద్యులు చెబుతున్నారు. ఇలాంటి వారు నృత్యాలు చేసే సమయంలో గుండె వేగం మరింత పెరిగి గుండెపోటు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని నిపుణుల అభిప్రాయం.
- సాధారణంగా మానవుని చెవులు 120 నుంచి 130 డెసిబుల్స్ వరకు శబ్దాన్ని భరించగలవు. 150 డెసిబుల్స్ మించితే వినికిడి సమస్య వస్తుంది. కర్ణభేరి దెబ్బతినే అవకాశం ఉంది. 150 డెసిబుల్స్ కంటే ఎక్కువ శబ్దం వింటే రక్తపోటు, పెరిగి గుండె సమస్యలు వస్తాయి. డీజే శబ్దాలతో వచ్చే వైబ్రేషన్స్ వల్ల శరీరంలో నాడి వ్యవస్థ దెబ్బతిని మెదడుకు రక్తం సరఫరా తగ్గుతుంది. గుండెకు రక్తం అందించే నాళాలు మూసుకుపోయి గుండె ఆగిపోయే అవకాశం ఉంది. దీని వల్ల గుండెపోటు వచ్చే అవకాశాలు ఎక్కువ ఉంటాయని వైద్యులు అంటున్నారు.

డీజేలతో ప్రమాదకరం

డీజే శబ్దాలతో గుండెతో పాటు చెవికి ఇబ్బంది ఎదురౌతుందని వైద్యులు అంటున్నారు. ఒకస్థాయి వరకు మాత్రమే చెవులు శబ్దాన్ని వినగలవు. సాంకేతికత మారుతుండటంతో విపణిలోకి భారీ శబ్దాలు చేసే స్పీకర్లు వస్తున్నాయి. కొంతమంది వీటిని వాహనాలకు అమర్చుకుని పాటలు పెడుతున్నారు. శుభ కార్యాలు, పుట్టిన రోజులు, పెళ్లి రోజులు, వినాయక నిమజ్జనాలు, పండగలకు డీజే పెట్టడం సర్వసాధారణమైంది. అయితే వాహనానికి దగ్గరగా నృత్యం చేయడం వల్ల స్పీకర్ల శబ్దాలకు గుండెలు అదురుతున్నాయి. ఈ నేపథ్యంలో హృదయ స్పందనలో ఆకస్మిక మార్పులు చోటుచేసుకుని గుండెపోటుకు గురవుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. దీంతో పాటు మద్యం తాగి నృత్యం చేయడం వల్ల మత్తులో కింద పడి తలకు, తగలకూడని భాగాలకు దెబ్బ తగలడం వల్ల కూడా మృతి చెందుతున్నట్లు తెలుస్తోంది.

జే-బ్రాండ్‌తో ముప్పుతిప్పలు

గత వైకాపా ప్రభుత్వం చిత్ర విచిత్రమైన పేర్లతో మార్కెట్‌లోకి తీసుకు వచ్చిన మద్యం బ్రాండ్లు యువత పాలిట శాపంగా తయారయ్యాయి. ఇందులో విష పూరిత రసాయనాలు మెదడును మొద్దుబారేలా చేయడంతో విపరీతమైన హాని కలుగజేస్తున్నాయని అధ్యయనాలు చెబుతున్నాయి. మద్యం మత్తులో నేరాలు పెరగడంతో పాటు, రోడ్డు ప్రమాదాలు, అనారోగ్య సమస్యలు ఎక్కువయ్యాయి. యువత ఎక్కువగా వీటి దుష్ప్రభావాలతో ఆసుపత్రుల పాలవడంతో పాటు కిడ్నీలు దెబ్బతిని, దీర్ఘకాలిక వ్యాధులకు గురవడంతో పాటు ఎక్కువ మంది కోలుకోలేక మృత్యువాత పడుతున్నారు. యువత గుండెలు ఆగడానికి జే-బ్రాండ్ మద్యం కూడా ఒక కారణమని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి



కొవిడ్ వచ్చిన తర్వాత చాలా మంది ఆసుపత్రికి వచ్చి కొంత దూరం నడిచే సరికే ఆయాసం వస్తోందని ఎక్కువ మంది మా వద్దకు వస్తున్నారు. సాధారణంగా కొవిడ్ సమయంలో రక్తం గడ్డ కట్టడం వల్ల గుండె ఆగిపోయి చాలా మంది మృత్యువాత పడ్డారు. అయితే ప్రస్తుతం ఈ సమస్య లేనప్పటికీ శరీరంలో ఇతర ఆరోగ్య సమస్యలున్న వారు అతిగా నృత్యం చేయడం, వ్యాయామం చేయడం వల్ల మృతి చెందే అవకాశాలు పెరుగుతాయని అధ్యయనాలు చెబుతున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని యువత జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా డీజే శబ్దాలను సాధ్యమైనంత దూరంగా ఉండి ఆస్వాదించాలి.

- డాక్టర్ శివరామకృష్ణ, సీనియర్ సర్జన్, ప్రభుత్వ సర్వజన బోధన ఆసుపత్రి, మదనపల్లె



బొప్పాయి రైతుల సమస్యల పరిష్కారానికి వినతి

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: జిల్లాలో బొప్పాయి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్ కోరారు. రైల్వేకోడూరులో ఆదివారం ఆయన మాట్లాడుతూ... ఈ నెల 5న రాయచోటిలో వ్యాపారులు, దళారులతో సమావేశం నిర్వహించాలని యత్నించగా ఎవరూ రాలేదన్నారు. ఈ విషయమై జేసీ ఆదర్శ్ రాజేంద్రన్‌ను శనివారం రాత్రి రాయచోటిలో కలిసి వినతి పత్రం అందించినట్లు వివరించారు. వారం రోజుల్లోపు పోలీసు, మార్కెటింగ్ శాఖల సమన్వయంతో సమావేశం ఏర్పాటు చేసి రైతులకు ధరలు పెంచేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. ఇతర ప్రాంతాల్లో రూ.25 వేలున్న టన్ను బొప్పాయి ధర ఇక్కడ మాత్రం రూ.10 వేలకు మించడం లేదని.. దళారులు, వ్యాపారులు కుమ్మక్కై రైతులను దోచుకుంటున్నారని రైతులు ఆరోపించారు.

దారి పొడవునా ఆక్రమణలు

150 కిలోమీటర్లు

బాహుదా... నది పొడవునా కబ్జాలు ● కర్ణాటకలో మొదలై చెయ్యేరు వరకూ

బాహుదా... మదనపల్లె ప్రాంత ప్రజలకు ఒకప్పటి జీవ నది. కరవుతాండవిస్తున్న సమయంలో తాగు, సాగునీటిని అందించిన కల్పతరువు. ఈ నది ప్రవాహం పొడవునా బీడు భూములను సస్యశ్యామలం చేసుకుంటూ పచ్చటి పొలాల పక్కనే గలగల పారేది. ఎక్కడో కర్ణాటక రాష్ట్రంలో పుట్టి మదనపల్లెలో ప్రవేశించే ఈ నదీమ తల్లి ఆక్రమణలతో కుంచించుకుపోతోంది. వినాశకాలే విపరీత బుద్ధి అన్న చందాన ఆక్రమణదారుల చేతికి చిక్కి విలవిల్లాడుతోంది. దీంతో భారీ వర్షాలు వచ్చినప్పుడల్లా కట్టలు తెంచుకుని పరిసర ప్రాంతాలను ముంచెత్తుతోంది. భవిష్యత్ తరాలకు ముప్పు వాటిల్లకుండా తక్షణ రక్షణ చర్యలు చేపట్టాల్సిన తరుణమిది.

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : కర్ణాటక రాష్ట్రం రాయలపాడు వద్ద బాహుదా ప్రారంభమై జిల్లాలో 150 కిలోమీటర్లు ప్రవహిస్తోంది. రాయలపాడు రిజర్వు అటవీ ప్రాంతంలో నుంచి వచ్చే నీరంతా బాహుదా నదిలోకి చేరుతోంది. ఇలా నదిలోకి చేరిన నీరు రాష్ట్ర సరిహద్దును దాటి చీకలబైలు వద్దకు చేరుకుని మదనపల్లె పట్టణం మధ్యలో సాగుతూ నిమ్మనపల్లె జలాశయంలోకి చేరుతుంది. అక్కడి నుంచి వాల్మీకిపురం, కేవీపల్లె మీదుగా అన్నమయ్య ప్రాజెక్టులో చేరి తర్వాత పెన్నానదిలో కలిసిపోతుంది.

1956లో ప్రాజెక్టు నిర్మాణానికి శ్రీకారం ; కరవుతో తాగు, సాగునీటికి ఇబ్బందిపడుతున్న మదనపల్లె, వాల్మీకిపురం తాలూకాల ప్రజలను ఆదుకోవడానికి ఫుడ్ కౌన్సిల్ ప్రభుత్వానికి నివేదికను తయారు చేసి పంపింది. 1956లో బాహుదా జలాశయం నిర్మాణానికి అంచనాలు తయారు చేసి పంపారు. అప్పట్లో భారత ప్రభుత్వం రూ.31 లక్షలు మంజూరు చేసింది. అయితే ఈ నిధులతో ప్రాజెక్టు నిర్మాణం అసాధ్యమని అంచనాలను రివైజ్ చేసి ప్రభుత్వానికి పంపారు. దీని ప్రకారం భారత ప్రభుత్వం రూ.63.55 లక్షలు మంజూరు చేసింది. 1966-67లో నిర్మాణ పనులు ప్రారంభించి 1974లో పూర్తి చేశారు.



మదనపల్లె పట్టణం నడిబొడ్డున బాహుదా నదిలో కలుస్తున్న మురుగు నీరు

రూ.కోటి అంచనాతో కబ్జాల తొలగింపు

2017లో బాహుదా ఆక్రమణలను తొలగించడానికి అధికారులు చర్యలు చేపట్టారు. సుమారు రూ.కోటి అంచనాతో నది పొడవునా ఆక్రమణలు తొలగించారు. రాష్ట్ర సరిహద్దు నుంచి మదనపల్లె పట్టణం వరకు ఉన్న అయిదు రీచుల్లో ఆక్రమణలు తొలగించారు. నదిని ఆక్రమించుకుని తమ భూముల్లోకి కలిపేసుకున్నట్లు గుర్తించారు. దీన్ని తొలగించిన తర్వాత వరద నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకం కలగలేదు. ఆ తర్వాత మళ్లీ యథావిధిగా నది ఆక్రమణకు గురైంది.

◆ మదనపల్లె పట్టణంలో నదిని చాలా వరకు ఆక్రమించుకుని అక్రమ నిర్మాణాలు చేపట్టారు. దీనికి తోడు పట్టణంలో వెలువడే మురుగంతా ఈ నదిలోనే ప్రవహిస్తోంది. నది ఆక్రమణకు గురికావడంతో 1996లో వచ్చిన వరద నీరు ఇళ్లలోకి వెళ్లింది. అలాగే 2021లో కూడా ఇదే పరిస్థితి ఎదురైంది.

ప్రత్యామ్నాయ చర్యలేవీ?

పట్టణంలో నుంచి వెలువడే మురుగు బాహుదా నదిలోకి వెళ్లకుండా పురపాలక అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి. మురుగు వెళ్లేందుకు వీలుగా ప్రత్యేకంగా పెద్ద కాలువను నిర్మిస్తే సమస్యకు పరిష్కారం లభిస్తుంది. లేదా బాహుదా నదికి ఇరువైపులా రక్షణగోడ ఏర్పాటు చేస్తే ఆక్రమణలతో పాటు మురుగు అందులోకి వెళ్లకుండా నియంత్రించవచ్చు. పురపాలక అధికారులు, పాలకులు ఆ దిశగా ఆలోచన చేయాల్సి ఉంది. జలవనరులశాఖ బాహుదా నది నిర్వహణపై ఎలాంటి చర్యలు చేపట్టడం లేదన్న ఆరోపణలున్నాయి. నది నిర్వహణ కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని జలవనరులశాఖ ఈఈ సురేంద్రరెడ్డి తెలిపారు. ఆక్రమణలకు పాల్పడితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

శుద్ధిజల కేంద్రం ప్రారంభం



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన మాట ప్రకారం పురపాలకసంఘం ఇందిరానగర్‌లో నీటి శుద్ధికేంద్రాన్ని ఏర్పాటు చేయించానని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. ఇందిరానగర్ షాదీమహల్ ప్రాంగణంలో పురపాలక సంఘం ఏర్పాటు చేసిన శుద్ధినీటి కేంద్రాన్ని ఎమ్మెల్యే ఆదివారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో తాను ఈ ప్రాంతానికి ప్రచారానికి వచ్చిన సమయంలో స్థానికులు శుద్ధికేంద్రాన్ని ఏర్పాటు చేయించాలని కోరారని తెలిపారు. గత వైకాపా ప్రభుత్వం వ్యవస్థలను నాశనం చేసిందని, పురపాలకసంఘానికి సంబంధించిన నిధులు రాష్ట్ర ఖజానాలో జమ చేసుకున్నారని ధ్వజమెత్తారు. వైకాపా చేసిన చేతగాని పరిపాలన వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పురపాలకసంఘంలో దెబ్బతిన్న రోడ్లను పునరుద్ధరించడానికి కమిషనర్‌కు ఆదేశాలు ఇచ్చానన్నారు. గ్రామాల్లో రోడ్లు వేయడానికి రూ.10 కోట్లు నిధులు ఇచ్చామని తెలిపారు. కార్యక్రమంలో పురపాలకసంఘం కమిషనర్ ప్రమీల, తెదేపా నాయకులు రామ్మూర్తినాయుడు, నౌషాద్, గౌస్‌ఆజాం, నాసిర్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యంతర భృతి ప్రకటించండి

కలికిరి, న్యూస్‌టుడే : ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు ప్రభుత్వం మధ్యంతర భృతి ప్రకటించాలని రాష్ట్ర రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోషియేషన్ కార్యదర్శి సురేంద్రరెడ్డి డిమాండ్ చేశారు. కలికిరి షాదీమహల్ కేంద్రంగా ఆదివారం మండల ఏపీఎస్‌జీఈఏ సమావేశం ఆ సంఘం అధ్యక్షుడు ఆదినారాయణరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సురేంద్రరెడ్డి మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు సురేంద్రరెడ్డి పేర్కొన్నారు. వచ్చే నెల మొదటి ఆదివారం కలికిరి వైద్య శిబిరం నిర్వహించాలని సమావేశంలో తీర్మానించారు. అనంతరం విశ్రాంత ఉద్యోగులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 33 మంది వృద్ధులకు మేడికుర్తి పీహెచ్‌సీ వైద్యఆరోగ్య సిబ్బంది బీసీజీ టీకాలు వేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు గోవర్ధన్‌రెడ్డి, అబ్దుల్‌ఖాదర్, ఉపాధ్యక్షుడు జయరాం, సభ్యులు నారాయణరెడ్డి, వెంకటరమణ, దేవేంద్ర, సరోజమ్మ, కాంతమ్మ, రాజకుమార్, బసవయ్య, వెంకటస్వామి, సుబ్బరాజులుశెట్టి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన


రామసముద్రం, న్యూస్‌టుడే : రామసముద్రంలో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలమహానాడు సంఘ నాయకులు ఆదివారం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కృష్ణప్ప, శేషాద్రి, నారాయణస్వామి, బాలాజీ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న మాల మహానాడు నాయకులు

కనీస వేతనానికి డిమాండు

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : పురపాలకసంఘాల్లో ఒప్పంద, పొరుగు సేవల కింద పనిచేస్తున్న కార్మికులను తక్షణమే క్రమబద్ధీకరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్‌యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామచంద్రయ్య డిమాండ్ చేశారు. ఆదివారం మదనపల్లె పురపాలకసంఘం కార్యాలయం ఆవరణలో మస్తాన్ అధ్యక్షతన ఔట్‌సోర్సింగ్ వర్కర్స్‌యూనియన్ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రామచంద్రయ్య మాట్లాడుతూ కార్మికులను క్రమబద్ధీకరించడంతో పాటు సమానపనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. కార్మికులకు కనీసం వేతనం కింద రూ.26వేలు ఇవ్వాలని, క్లాప్ ఆటో డ్రైవర్లకు, పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలకు వేతనాలు పెంచడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలనిన్నారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, యూనియన్ జిల్లా కార్యదర్శి సురేష్‌కుమార్, తిరుమల, దేవ, నాగరాజు, ముబారక్, పృథ్వీరాజ్, ఇంద్రాణి, వాసు, ఓబులేశు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీ మున్సిపల్ వర్కర్స్‌యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామచంద్రయ్య, పక్కన నాయకులు

బ్యాడ్మింటన్‌లో ధ్రువతార హోత్రిశ్రీ

బ్యాట్ పడితే పతకం కొట్టాల్సిందే

జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ

● పీలేరుకు చెందిన ప్రభాకర్‌రెడ్డి బ్యాడ్మింటన్‌లో జాతీయ క్రీడాకారుడు కావడంతో చిన్నతనం నుంచి కుమార్తెను కూడా ఆ క్రీడలో అంతర్జాతీయ స్థాయి క్రీడాకారిణిగా తీర్చిదిద్దాలని ఆశించారు. కన్నవారి ఆశయం నెరవేర్చేందుకు చదువుతో పాటు బ్యాడ్మింటన్‌లోనూ తర్ఫీదు పొందుతూ జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని ప్రశంసలు అందుకొంటోంది తాటిగుట్ల హోత్రిశ్రీ. కుమార్తె లక్ష్యానికి సహకారంగా విద్యార్థిని తల్లిదండ్రులు ప్రభాకర్ రెడ్డి, లావణ్య పీలేరులో హోత్రిశ్రీ షటిల్ అకాడమిని ఏర్పాటు చేసి ఇండోర్ స్టేడియంలో పలువురికి శిక్షణ ఇస్తున్నారు. అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులైన గోపిచంద్, సైనా నెహ్వాల్, పీవీ సింధు లాంటి వారిని ఆదర్శంగా తీసుకుని రాణిస్తోంది.

హోత్రిశ్రీ... బ్యాడ్మింటన్ ధ్రువ తార... పీలేరుకు చెందిన ఈ చిన్నారి మాజీ సైనికోద్యోగి, స్వతహాగా బ్యాడ్మింటన్ క్రీడాకారుడైన టి.ప్రభాకరరెడ్డి కుమార్తె. తల్లి లావణ్య గృహిణి, అక్క పావనిశ్రీ డిగ్రీ చదువుతోంది. హోత్రిశ్రీ పీలేరు శ్రీకాకతీయ విద్యాసంస్థలో పదో తరగతి పూర్తి చేసుకుని ప్రస్తుతం ఇంజినీరింగ్ డిప్లొమా చదువుతోంది. హైదరాబాదులోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో భాస్కర్ నేతృత్వంలో ప్రత్యేక శిక్షణ తీసుకుని జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు. ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారులు పుల్లెల గోపీచంద్, సైనా నెహ్వాల్, పీవీ సింధులను స్ఫూర్తిగా తీసుకుని రాణిస్తోంది.

\- పీలేరు, న్యూస్‌టుడే

సాధించిన విజయాలివి...

- 2017లో హైదరాబాదు గోపిచంద్ అకాడమిలో జాతీయ స్థాయి సబ్ జూనియర్స్ బ్యాడ్మింటన్ పోటీల్లో పతకం సాధించారు.
- 2017లో రాజమండ్రిలో అండర్-15 విభాగంలో ఆంధ్ర రాష్ట్ర సబ్ జూనియర్ బ్యాడ్మింటన్‌లో ఛాంపియన్‌షిప్ సాధించారు. ఇదే ఏడాది రాజమండ్రిలో అండర్-13 విభాగంలో ఏపీ స్టేట్ సబ్ జూనియర్స్ విభాగంలో కాంస్య పతకం సాధించారు.
- 2018 మే 25 నుంచి 28వ తేదీ వరకు నెల్లూరులో జరిగిన అండర్-14 విభాగంలో మినీ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్పును కైవసం చేసుకున్నారు.
- బెంగళూరులో అండర్-13 విభాగంలో జరిగిన బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతగా నిలిచారు. న్యూ దిల్లీలో త్యాగరాజ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో పీఎన్‌బీ మీట్‌లో జేబీసీ-3లో అండర్-13 విభాగంలో కాంస్య పతకం సాధించారు.
- 2017 ఫిబ్రవరి 13న హైదరాబాదు సౌత్‌జోన్ స్థాయి పీఎన్‌బీ మెట్‌లైఫ్ జేబీసీ పోటీల్లో పాల్గొని విజేతగా నిలిచారు.
- 2017 జులై అండర్-13 విభాగంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి ర్యాంకింగ్ టోర్నమెంట్‌లో బంగారు పతకం దక్కించుకున్నారు.
- 2017 జులై అండర్-15 విభాగంలో రాష్ట్రస్థాయి ర్యాంకింగ్ టోర్నమెంట్‌లో కాంస్య పతకం దక్కించుకున్నారు.
- 2017 అక్టోబరులో జరిగిన అండర్-14 విభాగంలో 63 స్కూల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పోటీల్లో తలపడి రజత పతకం సొంతం చేసుకున్నారు. అదే నెలలో జరిగిన అండర్-14 విభాగంలో ఏపీ రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతగా నిలిచారు.
- 2017 జులై న్యూదిల్లీలో అండర్-13 విభాగం పీఎన్‌బీ మెట్‌లైఫ్ జేబీసీ-3 గ్రాండ్ ఫైనల్‌లో రన్నరప్‌గా నిలిచారు.



సింగిల్స్, డబుల్స్ విజేత హోత్రిశ్రీని అభినందిస్తున్న పీవీ సింధు (పాత చిత్రం)

- 2018 ఏప్రిల్ 13వ తేదీ బెంగళూరులో జరిగిన సెల్‌నైట్ ఆల్ ఇండియా ఓపెన్ సబ్ జూనియర్ ఛాంపియన్ షిప్ పోటీలో విజేత.
- 2018 జూన్‌లో జరిగిన అండర్ -13 విభాగంలో పీఎన్‌బీ మెట్‌లైఫ్ జెబీసీ 4 సౌత్‌జోన్ టోర్నమెంట్‌లో విజేత.
- 2018లో డిల్లీ, అస్సాం, మణిపూర్, ప్రొద్దుటూరు, తిరుపూర్‌లో జరిగిన అండర్-17 బ్యాడ్మింటన్ పోటీల్లో సత్తాచాటి ప్రశంసాపత్రాలతో పాటు జ్ఞాపికలు దక్కించుకుంది.
- 2019లో ప్రొద్దుటూరు, బెంగళూరులో సౌత్ జోన్ పోటీల్లో పాల్గొన్నారు. కడపలో ఆల్‌ఇండియా బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొని ప్రశంసాపత్రాలు పొందారు. బ్యాడ్మింటన్‌లో చూపిన ప్రతిభకు 2019లో సీఎం చంద్రబాబు నుంచి అబ్దుల్ కలాం పురస్కారాన్ని అందుకున్నారు.
- 2021లో బెంగళూరు పంజాబ్ నేషనల్ బ్యాంకు ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని విజేతగా నిలిచారు.
- 2024 సెప్టెంబరులో కడప జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో కందుల ఓబుల్‌రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ కనబరచి చెన్నైలో జరిగే సౌత్ జోన్ పోటీలకు ఎంపికయ్యారు.



రాజమహేంద్రవరంలో మంత్రి కొల్లు రవీంద్ర నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న హోత్రిశ్రీ

ప్రపంచ నెంబర్‌వన్ స్థానమే లక్ష్యం

తల్లిదండ్రుల ప్రోత్సాహం సంతృప్తిగా ఉంది. బ్యాడ్మింటన్‌లో ఇంకా శిక్షణ పొందుతున్నా... నిరంతరం సాధన ద్వారా ప్రపంచ నెంబర్ వన్ కావడమే నా లక్ష్యం. పీలేరులో షటిల్ బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేసి ఔత్సాహితులకు ఆటలో శిక్షణ ఇవ్వాలి. పీలేరుకు గుర్తింపు తీసుకురావాలని కృషి చేస్తున్నా. **- హోత్రిశ్రీ, పీలేరు**

హమాలీలకు ప్రత్యేక చట్టం తేవాలి



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎన్‌డీ రవి, పక్కన సంఘం ప్రతినిధులు

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: తమిళనాడు, కేరళ తరహాలో హమాలీల కోసం ప్రత్యేక సంక్షేమ చట్టాన్ని రాష్ట్రంలోనూ తీసుకురావాలని హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎన్‌డీ రవి డిమాండు చేశారు. బి.కొత్తకోట షాదీమహల్‌లో ఆదివారం హమాలీల యూనియన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు మాట్లాడుతూ.. సంక్షేమ చట్టం అమల్లోకి వస్తే రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షల మందికి పైగా ఉన్న హమాలీలకు పింఛను, ఈఎస్ఐ, ప్రమాద బీమా, పిల్లల చదువులకు ఆర్థిక సాయం, పక్కాగృహాలు, రేషన్‌కార్డులు మంజూరు వంటి సదుపాయాలు లభిస్తాయని తెలిపారు. సంక్షేమ చట్టం కోసం హమాలీలు ఐక్యంగా ప్రభుత్వంపై వివిధ మార్గాల ద్వారా ఒత్తిడి పెంచాలని సూచించారు. దేశంలో కార్పొరేట్ సంస్థలకు రూ.వేల కోట్లు రాయితీలు ఇస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులను పట్టించుకోకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. యూనియన్ రాష్ట్ర సమితి సభ్యులు ఎ.బాబు, ఏఐటీయూసీ నాయకులు బషీర్‌ఖాన్, జి.రఘునాథ్, మండల నాయకులు తంబయ్యశెట్టి, అష్రఫ్‌అలీ, రామాంజులు, జి.నారాయణస్వామి, సమీవుల్లా, మోదీన్, వలీసాబ్, గంగులప్ప, తదితరులు పాల్గొన్నారు.

వైద్య వృత్తిలో ఏఎన్ఎంల పాత్ర కీలకం



ఏఎన్‌ఎంలతో సూపరింటెండెంట్ చంద్రశేఖర్, వైద్యులు ఈశ్వర సురేంద్ర, నాగవేణి తదితరులు

పీలేరు, న్యూస్‌టుడే: వైద్యవృత్తి చాలా పవిత్రమైనదని క్షేత్రస్థాయిలో పని చేసే వైద్యసిబ్బందిని ప్రజలు దేవుళ్లుగా భావిస్తారని పీలేరు వంద పడకల ఆసుపత్రి సూపరింటెండెంట్ చంద్రశేఖర్ అన్నారు. ఆసుపత్రిలో ఏడాది పాటు ఏఎన్ఎంలుగా శిక్షణ పొందిన 25 మంది జీఎన్ఎంలకు ఆదివారం చంద్రశేఖర్ ఇతర వైద్యులు శాలువులు కప్పి జ్ఞాపికలతో సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ.. వైద్యవృత్తిలో జీఎన్ఎంలుగా ఎంపికై పీహెచ్‌సీల్లో క్షేత్రస్థాయిలో ఆరోగ్య కార్యకర్తలు పనిచేసి వ్యాధులను తొలిగా గుర్తించడంలో ప్రధాన పాత్ర వహిస్తారని తెలిపారు. అదే ఎన్ఎన్ఎంలుగా ఆసుపత్రిలో వైద్యసేవలందించడంలో శిక్షణ పొందారని చెప్పారు. శిక్షణను సద్వినియోగం చేసుకుని పీహెచ్‌సీలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించి మంచి పేరు తెచ్చుకోవాలని చంద్రశేఖర్ సూచించారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీలత, ఈశ్వరసురేంద్ర, నాగవేణి పాల్గొన్నారు.

మంత్రులకు స్వాగతం



హోంమంత్రి అనితతో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, తెదేపా నేత జయచంద్రారెడ్డి

ములకలచెరువు న్యూస్‌టుడే : రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితకు ఆదివారం మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, తంబళ్లపల్లె తెదేపా నేత జయచంద్రారెడ్డిలు బెంగళూరు ఎయిర్‌పోర్టులో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా హోంమంత్రికి పుష్ప గుచ్ఛం అందజేసి స్వాగతించారు. చిత్తూరు జిల్లా పుంగనూరు పర్యటనలో భాగంగా హోంమంత్రి వచ్చారు. ఈ సందర్భంగా తంబళ్లపల్లె నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గురించి ఆమెకు తెలియజేశారు.

మదనపల్లె పట్టణం : రాష్ట్ర మైనార్టీశాఖ మంత్రి ఫరూక్‌కు తెదేపా నాయకులు ఘనస్వాగతం పలికారు. పుంగనూరులో జరిగిన బాలిక మృతి సంఘటనలో బాధితకుటుంబసభ్యులను పరామర్శించిన తర్వాత మధ్యాహ్నం మంత్రి మదనపల్లెలోని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఇంటికి వచ్చారు. మంత్రికి స్థానిక తెదేపా నాయకులు కరీముల్లా, బాబునాయుడు, రామకృష్ణాచారి, షంషీర్, నవీన్‌చౌదరి, నాగార్జునబాబు, ప్రశాంత్, రఫీ, పఠాన్‌ఖాదర్‌ఖాన్ తదితరులు మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ● బాలిక మృతి ఘటనపై విచారణ చేయడానికి పుంగనూరుకు వచ్చిన రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనితను తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు, రాజంపేట పార్లమెంటు నియోజకవర్గం కార్యదర్శి దొరస్వామినాయుడు మర్యాద పూర్వకంగా కలిశారు. పర్యటన ముగిసే వరకు ఆయన మంత్రి వెంట ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

పెద్దతిప్పసముద్రం, న్యూస్‌టుడే : మండలంలోని రాపూరివాండ్లపల్లి పంచాయతీ, కాయలవాండ్లపల్లెకు చెందిన పెద్దపాళ్యం సూర్యనారాయణ గుండెపోటుతో మృతి చెందడంతో తెదేపా రాష్ట్ర కార్యదర్శి కొండ్రెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించారు. శనివారం ఉదయం కొండ్రెడ్డిని అరెస్ట్ చేసి మదనపల్లెకు తరలించడంతో ఆయన అనుచరుడైన సూర్యనారాయణ మదనపల్లెకు చేరుకొని పోలీస్‌స్టేషన్ వద్ద ధర్నాలో పాల్గొన్నారు. అనంతరం కొండ్రెడ్డిని తంబళ్లపల్లెకు తరలిస్తున్నారని తెలియడంతో ద్విచక్ర వాహనంలో తంబళ్లపల్లెకు చేరుకున్నారు. కొండ్రెడ్డిని తంబళ్లపల్లె స్టేషన్‌కు తీసుకురాకపోవడంతో మనస్తాపం చెందిన సూర్యనారాయణ గుండెపోటుతో మృతిచెందారు.



బాధితులతో మాట్లాడుతున్న తెదేపా రాష్ట్ర కార్యదర్శి కొండ్రెడ్డి

కొత్తరకం మోసం... నేరగాళ్ల విన్యాసం

జిల్లాకో సైబర్ స్టేషన్‌తో తీరనున్న సమస్య

టోల్ ఫ్రీ నంబరు 1930తో ఖాతాలు భద్రం

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : మదనపల్లెకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయురాలి చరవాణికి తక్కువ ధరకు బంగారు విక్రయిస్తామని చరవాణికి సంక్షిప్త సమాచారం వచ్చింది. ఈ విషయాన్ని నమ్మిన ఆమె సంక్షిప్త సమాచారం పంపిన వారికి ఫోన్ చేసింది. దీంతో వారు బంగారు పంపేందుకు కస్టమ్స్ సుంకం కింద రూ.3 లక్షలు ఖాతాకు జమ వేయాలని చెప్పారు. దీంతో ఆమె రూ.50 లక్షలు విలువైన బంగారు వస్తుందని ఆశపడి రూ.3 లక్షలు సైబర్ నేరగాళ్ల ఖాతాకు వేసింది. అలా ఆమె రూ.15 లక్షల వరకు వారికి డబ్బు పంపింది. అయినప్పటికీ బంగారు రాకపోవడంతో మోసపోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు ఆమె ఖాతాను బ్లాక్ చేయించారు. ఆమె పంపిన ఖాతాను కూడా జప్తు చేయించారు. అయినా అప్పటికే ఆమె రూ.15 లక్షలు పోగొట్టుకున్నారు.



కొండయ్య నాయుడు, డీఎస్పీ, మదనపల్లె

● మదనపల్లెకు చెందిన వ్యక్తి ఓ బ్యాంకు క్రెడిట్ కార్డు తీసుకున్నాడు. బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామని క్రెడిట్ కార్డు అన్‌లిమిటెడ్ చేసేందుకు వివరాలు చెప్పాలని కోరారు. సైబర్ నేరగాళ్లు ఆన్‌లైన్‌లో వస్తువులు కొనుగోలు చేసి ఓటీపీ చెప్పాలని అన్నారు. సదరు వ్యక్తి బ్యాంకు సిబ్బందే ఫోన్ చేస్తున్నారని భావించి ఓటీపీ చెప్పడంతో ఖాతాలో ఉన్న రూ.2 లక్షల నగదు ఖాళీ చేశారు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

● మదనపల్లెకు చెందిన సాఫ్ట్‌వేర్ దంపతులు ఇంటి నిర్మాణం కోసం రూ.కోటి వరకు జమ చేసుకున్నారు. అదే సమయంలో ఆన్‌లైన్ ట్రేడింగ్ ద్వారా డబ్బు రెట్టింపు అవుతుందని స్నేహితుల ద్వారా తెలుసుకుని ఆన్‌లైన్ ట్రేడింగ్ చేశారు. మొదట లాభాలు వచ్చాయి. భార్య రూ.61 లక్షలు, భర్త రూ.50 లక్షలు ట్రేడింగ్‌లో పెట్టారు. డబ్బు విత్‌డ్రా చేసుకునేందుకు యత్నించగా రూపాయి కూడా రాలేదు. దీంతో తాము మోసపోయామని గుర్తించి పోలీసులను ఆశ్రయించారు.

● ఇవి ఇటీవల కాలంలో జిల్లాలో జరిగిన ఆర్థిక నేరాలు.. కొత్తకొత్త విన్యాసాలతో సైబర్ నేరగాళ్లు వల విసురుతూ లక్షల రూపాయలు దోచేస్తున్నారు. వారి బారిన పడి అమాయకులు డబ్బు పోగొట్టుకుని ఎవరికి చెప్పుకోవాలో తెలియక అవమాన భారంతో ఇబ్బందులు పడుతున్నారు. ఒక వేళ ఫిర్యాదు చేసినా నేరగాళ్లు దొరకడం కష్టంగా మారింది. దీంతో బాధితులు తమ వద్ద ఉన్న డబ్బు పోగొట్టుకుని ఇబ్బందులు పడుతున్నారు.

ప్రభుత్వ నిర్ణయంతో ప్రజల్లో సంతోషం

సైబర్ నేరాలను అరికట్టేందుకు కూటమి ప్రభుత్వం ముందడుగు వేసింది. ఇందులో భాగంగానే జిల్లాకు ఓ సైబర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీని వల్ల సైబర్ నేరాలు తగ్గించడంతో పాటు ఒక వేళ సైబర్ నేరగాళ్లు ఎవరిదైనా డబ్బు కాజేస్తే వెంటనే ఫిర్యాదు చేసేలా ఈ నిర్ణయం తీసుకున్నారు. జిల్లా కేంద్రంలోని రాయచోటిలో సైబర్ పోలీస్ ఠాణా ఏర్పాటు కానుంది. ప్రస్తుతం ఎస్ఐ స్థాయి అధికారితో పాటు కొంత మంది సిబ్బంది మాత్రమే ఉన్నారు. స్టేషన్ ఏర్పాటైతే సీఐ స్థాయి అధికారితో పాటు సాంకేతిక పరిజ్ఞానం కూడా అందుబాటులోకి వస్తుంది. దీని వల్ల వీలైనంత ఎక్కువ మందిని ఇలాంటి అక్రమాల నుంచి కాపాడడంతో పాటు జనాన్ని అప్రమత్తం చేయవచ్చు.

1930తో నేరాలకు చెక్

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకున్న వారు వెంటనే 1930కు ఫోన్ చేసి సమాచారం ఇస్తే ఆ డబ్బు ట్రాన్స్‌ఫర్ అయిన ఖాతాను స్తంభింపజేసి అక్రమార్కులు ఆ డబ్బును బ్యాంకు నుంచి పొందకుండా అడ్డుకోవచ్చు. ఈ నంబరుకు ఫోన్ చేసిన వెంటనే సంబంధిత బ్యాంకు అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఖాతాను ఫ్రీజ్ చేసే అవకాశం ఉంది. అయితే ఈ ప్రక్రియ సైబర్ మోసానికి గురైన కొద్ది సేపటిలోనే జరగాలి. టోల్ ఫ్రీ నంబరు 1930కు సమాచారం ఇచ్చిన తర్వాత సంబంధిత స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేయడం వల్ల విచారణ వేగవంతం అవుతుంది. బాధితుల నుంచి డబ్బు వెళ్లిన ఖాతాలో ఎక్కువ డబ్బు ఉంటే దాన్ని కోర్టు ద్వారా బాధితులకు ఇప్పించే వెసులుబాటు కూడా ఉంది.

సైబర్ స్టేషన్‌తో సత్వర న్యాయం

రాష్ట్రవ్యాప్తంగా సైబర్ నేరాలు అరికట్టేందుకు ప్రభుత్వం జిల్లాకో సైబర్ స్టేషన్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ ఠాణా ఏర్పాటుతో సైబర్ నేరాలు చాలా వరకు తగ్గుతాయి. అలాగే బాధితులకు సత్వర న్యాయం జరుగుతుంది. జిల్లాలోనే సైబర్ స్టేషన్ ఉండటం వల్ల బాధితులు నేరుగా ఫిర్యాదు చేయవచ్చు.

\- కొండయ్య నాయుడు, డీఎస్పీ, మదనపల్లె

ఆదర్శ పాఠశాల విద్యార్థుల సత్తా

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: తిరుపతిలో ఇటీవల నిర్వహించిన పోటీల్లో బి.కొత్తకోట ఆదర్శ విద్యార్థులు సత్తా చాటారు. అండర్-19 హైజంప్ విభాగంలో విద్యాలయ విద్యార్థి పి.బాలు రాష్ట్ర స్థాయిలో మూడోస్థానంలో నిలిచారు. త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. అయితే అండర్-17 షటిల్ విభాగంలో నిత్యసాయిశ్రీ, అండర్-14 విభాగంలో హరణి అల్మాస్‌లు జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. రాష్ట్ర, జిల్లా జట్లకు ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపల్ శ్రీనునాయక్, పీఈటీ సుధీర్ కుమార్‌లు ప్రత్యేకంగా అభినందించారు.

పాముకాటుతో వ్యక్తి మృతి



అజయ్ (పాతచిత్రం)

ములకలచెరువు న్యూస్‌టుడే : ఉత్తరప్రదేశ్ రాష్ట్రం నుంచి ఖాళీ టమాట క్రేట్‌లలో వచ్చిన పాము కరిచి వ్యక్తి మృతి చెందిన సంఘటన అన్నమయ్య జిల్లా ములకలచెరువు మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ములకలచెరువు వినాయక నగర్‌కు చెందిన అజయ్ (34) తాపీ మేస్త్రీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. భార్య సునిత టమాట మార్కెట్‌లో కూలీ పనులు చేస్తుంటారు. ఈ నేపథ్యంలో అజయ్ శనివారం రాత్రి తన భార్య సునితకు భోజనం ఇచ్చేందుకు మార్కెట్‌కు వెళ్లారు. ఈ క్రమంలో మార్కెట్‌లో క్రేట్‌లలో ఉన్న పామును చంపేందుకు స్థానికులు ప్రయత్నించగా అటుగా వెళ్తున్న అజయ్‌ను పాము కాటు వేసింది. బాధితుడిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మదనపల్లెకు తరలించగా అజయ్ మృతి చెందారు. ములకలచెరువు మార్కెట్ నుంచి ఉత్తరప్రదేశ్‌కు టమాటాలు ఎక్కువగా ఎగుమతి అవుతున్నాయి. అక్కడి నుంచి ఖాళీ క్రేట్‌లతో యూపీ నుంచి సుమారు 1600 కి.మీ దూరం నుంచి పాము ఇక్కడికి వచ్చినట్లు తెలిసింది. పాము నల్లగా ఉండడంతో స్థానికులు యూపీ నుంచి పాము వచ్చిందంటున్నారు. పాముకాటుకు గురై మృతి చెందిన అజయ్‌కు భార్య, ముగ్గురు కుమార్తెలున్నారు. తండ్రి మృతితో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : రోడ్డు ప్రమాదంలో బిహార్ వాసి తీవ్రంగా గాయపడిన ఘటన ఆదివారం తంబళ్లపల్లె మండలంలో జరిగింది. బిహార్‌కు చెందిన ఫిరోజ్ అన్సారి కూలీపనుల నిమిత్తం కొన్ని రోజుల కిందట తంబళ్లపల్లె మండలం కుక్కరాజుపల్లెకు వచ్చారు. ఈ నేపథ్యంలో ఆదివారం సరకులు కొనుగోలు చేసేందుకు గుర్రంకొండకు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా కుమ్మరపల్లె వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆయన్ను స్థానికులు 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తంబళ్లపల్లె పోలీసులు విచారణ చేస్తున్నారు.

ఆటో డ్రైవరుకు...

కలకడ : చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై కలకడ సమీపంలో బాటవారిపల్లె ఉన్నత పాఠశాల వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ శబరీష్‌కు గాయాలైనట్లు ఎస్.ఐ రామాంజినేయులు పోలీసులు తెలిపారు. వివరాలు.. గాలివీడు మండలం నూలివీడు కొండ్రెడ్డిగారిపల్లెకు చెందిన శబరీష్ తన లగేజీ ఆటోతో పీలేరుకు వెళ్లి తిరిగి వస్తుండగా బాటవారిపల్లె వద్ద ఎదురుగా మినీలారీ వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు గాయాలు కావడంతో 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఈ మేరకు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

లారీలు ఢీ కొని...

కురబలకోట : జాతీయ రహదారిలో ఎదురెదురుగా వస్తోన్న రెండు లారీలు ఢీకొన్నాయి. పోలీసుల కథనం ప్రకారం పెనుగొండ నుంచి చెన్నై వెళ్తున్న కంటైనర్ లారీ, కాంచీపురం నుంచి అనంతపురం వెళ్తున్న రెండు లారీలు ఆదివారం దొమ్మన్నబావికి సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఇందులో కంటైనర్ లారీ బోల్తాపడగా, మరో లారీ ముందు భాగం దెబ్బతింది. ఈ ఘటనలో లారీ డ్రైవర్లు గాయపడ్డారు.

మహిళపై కత్తితో దాడి

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : మహిళపై కత్తితో దాడి చేసి గాయపరిచిన ఘటన మదనపల్లె మండలంలో ఆదివారం రాత్రి జరిగింది. బాధితురాలి కథనం మేరకు.. మండలంలోని అరవవాండ్లపల్లెకు చెందిన హరికి అదే గ్రామానికి చెందిన బంధువు పాపయ్యకు మధ్య దారి విషయమై భూ వివాదం ఉంది. ఈ నేపథ్యంలో హరి భార్య శ్రావణి గొడవలున్న దారిలో పొలం వద్ద నుంచి ఇంటికి వస్తుండగా పాపయ్య, అతని కుటుంబ సభ్యులు అడ్డుకున్నారు. దీంతో శ్రావణి అలాగే వచ్చేచారు. దీంతో కోపం పెంచుకున్న పాపయ్య అతని కుటుంబ సభ్యులు, మరికొందరు శ్రావణి ఇంట్లోకి చొరబడి ఆమెపై కత్తులతో దాడి చేసి గాయపరిచారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన ఆమెను కుటుంబ సభ్యులు మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న మదనపల్లె రూరల్ సీఐ కళా వెంకటరమణ ఆసుపత్రి వద్దకు చేరుకుని వివరాలు సేకరించారు. కేసు విచారణ చేస్తున్నామని తెలిపారు.

యువకుడిపై...

చోరీ చేశాడన్న అనుమానంతో ఓ యువకుడిపై పలువురు దాడి చేసి గాయపరిచిన ఘటన మదనపల్లె మండలంలో శనివారం రాత్రి జరిగింది. సీటీఎం గ్రామానికి చెందిన సాయి ట్రాక్టర్ల బ్యాటరీలు చోరీ చేశాడన్న అనుమానంతో అదే ప్రాంతానికి చెందిన పలువురు దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన అతన్ని కుటుంబ సభ్యులు మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసులు విచారణ చేస్తున్నారు.

300 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

పెద్దమండ్యం, న్యూస్‌టుడే : మండలంలోని సిద్దవరం పంచాయతీ చింతమానువారిపల్లెలో ఆదివారం ఉదయం స్థానిక ఎస్సై పీవీ రమణ ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు నిర్వహించారు. దాడుల్లో చింతమానువారిపల్లెకు పడమరవైపున ఉన్న సాలార్‌సాబ్ మామిడితోటకు పక్కన 300 లీటర్లు సారా బెల్లం ఊటను గుర్తించి ధ్వంసం చేసినట్లు ఆయన తెలిపారు. మధు, కృష్ణమూర్తి, ఖాన్ పాల్గొన్నారు.

సారా తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

మదనపల్లె నేరవార్తలు : సారా తరలిస్తున్న వ్యక్తిని ఆదివారం అరెస్టు చేసినట్లు ఒకటోపట్టణ సీఐ చాంద్‌బాషా తెలిపారు. పట్టణంలోని బుగ్గకాలువకు చెందిన బాలాజీనాయక్ పట్టణంలోకి 20 లీటర్ల సారా తీసుకొస్తుండగా అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు తెలిపారు. పట్టణంలో ఎక్కడైనా సారా విక్రయాలు, తరలింపు, తయారీ ఉంటే తమకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

మదనపల్లె

•మదనపల్లె •పీలేరు •తంబళ్లపల్లె

పర్యావరణ పరిరక్షణకు కృషి


మొక్కకు నీరు పోస్తున్న కమిషనర్ ప్రమీల

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : పట్టణంలో విరివిగా మొక్కలు నాటి పచ్చదనం పెంచుకుందామని పురపాలకసంఘం కమిషనర్ ప్రమీల అన్నారు. ఆదివారం పట్టణంలోని ఇందిరానగర్‌లో సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పురపాలకసంఘం పరిధిలో ప్రతి వారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. ప్రజలు కూడా భాగస్వాములై మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతను చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో డీఈఈ శ్రావణి, ఏఈఈ స్నేహప్రియ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

తీగలతో పొంచిఉన్న ప్రమాదం



వ్యవసాయ పొలాల వద్ద విద్యుత్తు తీగలు కిందకు వేలాడుతుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాతములకలచెరువు సమీపంలోని కొత్తకుంట వద్ద ఇటీవల కురిసిన వర్షాలకు విద్యుత్తు తీగలు తెగి కింద పడి నేలపై వేలాడుతున్నాయి. విద్యుత్తు శాఖ కార్యాలయానికి సంబంధించిన నెంబర్‌కు ఫోన్ చేసినా పనిచేయలేదని రైతులు చెబుతున్నారు. తీగలను సరిజేయాలని రైతులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ములకలచెరువు**

మేమున్నాం... మీకు తోడుగా...

(10 AM to 1 PM)
మదనపల్లె : 8008574611
పీలేరు : 8008574958
తంబళ్లపల్లె : 8008574612

- న్యూస్‌టుడే, మదనపల్లె గ్రామీణ

?: మండలంలోని పుంగనూరు రోడ్డులోని బసినికొండ పంచాయతీ సచివాలయం ఎదుట విద్యుత్తు స్తంభం, నియంత్రికల చుట్టూ తీగమొక్కలు, పిచ్చిమొక్కలు అల్లుకుని ప్రమాదకరంగా ఉన్నాయి. అధికారులు చర్యలు తీసుకోవాలి. **- సుజాత, బసినికొండ**

✓: తీగ, పిచ్చిమొక్కలు తొలగించేలా చర్యలు తీసుకుంటాం. **- విష్ణు, కార్యదర్శి, బసినికొండ, మదనపల్లె**

?: మండలంలోని అగ్గిపెట్టె ఫ్యాక్టరీ నుంచి రామాచర్లపల్లె పంచాయతీ సచివాలయానికి వెళ్లే మార్గంలోని సాయిబాబా రోడ్డు క్రాస్‌లో చెత్తదిబ్బలు పేరుకుపోయాయి. వర్షాలు కురిస్తే నీరు కలుషితమై దిగువ ప్రాంతంలోని మురుగునీటి కాలవలోకి, రోడ్డుపైకి ప్రవహిస్తుంది. **- గౌరమ్మ, నిమ్మనపల్లె రోడ్డు, మదనపల్లె**

✓: పారిశుద్ధ్య పనులు చేయించి సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం. **- మస్తాన్‌వల్లి, ఎంపీడీవో, మదనపల్లె**

?: మదనపల్లెలోని రాంగోపాల్‌నాయుడు వీధి గ్రూప్ థియేటర్ల సమీపంలో రోడ్డుపై చెత్తదిబ్బలు పేరుకుపోయాయి. దుర్వాసన వస్తోంది. దోమలు, ఈగలకు నిలయంగా మారింది. **- భాస్కర్, స్థానికుడు**

✓: పారిశుద్ధ్య పనులు చేయించి, చెత్తను సంపద కేంద్రాలకు తరలిస్తాం. **- ప్రమీల, కమిషనర్, పురపాలక సంఘం**

- న్యూస్‌టుడే, పీలేరు గ్రామీణ

?: పీలేరు పట్టణం అయ్యపురెడ్డికాలనీలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. మురుగు కాలువల వెంట గడ్డి పెరిగి దోమల వ్యాప్తితో వ్యాధుల బారిన పడుతున్నాం. **- దొరస్వామినాయుడు, అయ్యపురెడ్డికాలనీ**

✓: ఈ ప్రాంతంలో పారిశుద్ధ్య పనులు చేపడతాం. **- గురుమోహన్, ఈవో, పీలేరు**

?: పీలేరు పట్టణం యర్రమరెడ్డి గుట్ట ప్రాంతం నుంచి మేకలవానికాలువ గ్రామానికి వెళ్లే మార్గంలో మురుగు వ్యవస్థ లేదు. మురుగు రోడ్డుపై పారుతోంది. **- స్థానికుడు**

✓: ఈ ప్రాంతంలో శాశ్వత పరిష్కారం దిశగా మురుగు కాలువ ఏర్పాటుకు నివేదిక పంపాం. నిధులు రాగానే పనులు చేపడతాం. **- గురుమోహన్, ఈవో, పీలేరు**

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు

పెద్దమండ్యం, న్యూస్‌టుడే: మండలంలో ఎక్కడైనా ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని స్థానిక తహసీల్దార్ సయ్యద్ అహమ్మద్ హెచ్చరించారు. గతంలో ఎక్కువగా విలువైన ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైనట్లు ఫిర్యాదులు వస్తున్నాయని వాటిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. మండలంలో పాపేపల్లి, పెద్దమండ్యం, సిద్దవరం, కలిచెర్ల, బండ్రేవు గ్రామాల్లో ఎక్కువగా ఆక్రమణకు గురైనట్లు పలువురు చర్చించుకుంటున్నారు. పెద్దమండ్యం బస్టాండు ప్రాంతం, ఆదర్శపాఠశాల సమీపంలో కొందరు దౌర్జన్యంగా ప్రభుత్వ భూములు ఆక్రమించుకున్నట్లు సమాచారం. మరికొందరు నకిలీపట్టాలు కలిగి ఉన్నారని, వాటిని సైతం హౌసింగ్ కాలనీల్లో బిల్లులు కూడా పెట్టకుండా పక్కనపెట్టినట్లు సమాచారం.

నవరాత్రి ఉత్సవం... ఆధ్యాత్మిక వైభవం


గండబోయనపల్లెలో లలితా త్రిపుర సుందరి దేవి అలంకరణలో సత్యమ్మ తల్లి


రామసముద్రం : పుష్పాలంకరణలో దుర్గాదేవి


పీటీఎం రోడ్డులో పార్వతీదేవి అలంకరణలో వాసవీ మాత

దసరా నవరాత్రుల సందర్భంగా మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె నియోజకవర్గాల వ్యాప్తంగా ఆయా ఆలయాల్లో ఆదివారం అంగరంగ వైభవంగా పూజలు నిర్వహించారు. వివిధ రూపాల్లో అమ్మవార్లను అలంకరించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని పూజలు చేశారు. నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

- న్యూస్‌టుడే, మదనపల్లె క్లస్టర్ బృందం


లలితా త్రిపుర సుందరి దేవిగా కలికిరి ఎల్లమ్మ


కోనలో త్రిపుర సుందరిదేవి అలంకరణలో చౌడేశ్వరీదేవి


మదనపల్లె : లలితాదేవిగా కన్యకాపరమేశ్వరి


బి.కొత్తకోటలో లలితాదేవి అలంకరణలో దర్శనమిస్తున్న అమ్మవారు


కంభంవారిపల్లె: త్రిపుర సుందరిదేవిగా చౌడేశ్వరమ్మ

వడ్డెర సంఘం కార్యవర్గం ఎంపిక


నూతనంగా ఎంపికైన సభ్యులతో వడ్డెర సంఘం నాయకులు

కురబలకోట, న్యూస్‌టుడే : మండల వడ్డెర సంఘానికి నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అంగళ్లులో ఆదివారం వడ్డెర సంఘ నాయకులు జరిపిటి రెడ్డెప్ప, పూలగంటి సురేంద్ర ఆధ్వర్యంలో సభ్యులు సమావేశమయ్యారు. ఇందులో భాగంగా మండల వడ్డెర సంఘానికి నూతన అధ్యక్షునిగా బండి వెంకటరమణ, ప్రధాన కార్యదర్శిగా ఉప్పితి ఈశ్వర్, ఉపాధ్యక్షులుగా పులగంటి శ్రీనివాసులు, కార్యదర్శిగా రాజోళ్ల వెంకటేష్, కోశాధికారిగా డేరంగుల భాస్కర్, సభ్యులుగా ఉప్పుతోళ్ల ఆనంద్, చెంబకూరి గోపాలకృష్ణ, దేవరింటి బాలకృష్ణ, ప్రధాన సలహాదారుగా రాజోళ్ల చలపతిని ఎన్నుకున్నారు.

నేత్రపర్వంగా చెన్నకేశవ కల్యాణం


ప్రత్యేక అలంకరణలో చెన్నకేశవస్వామి

పెద్దతిప్పసముద్రం, న్యూస్‌టుడే: మండలంలోని పులికల్లు గ్రామంలో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి కల్యాణోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. పులికల్లుకు చెందిన శివస్వరూప్, ఉమామహేశ్వర్, పవన్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు అభిషేకాలతో పాటు కళ్యాణోత్సవం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాల అందజేశారు.


గంగమ్మకు ప్రత్యేక పూజలు

ములకలచెరువు : తంబళ్లపల్లె మండలం గోపిదిన్నె బస్‌స్టాప్ వద్ద వెలసిన ఎగువగిండి గంగమ్మకు ఆదివారం గ్రామస్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో అమ్మవారి నూతన విగ్రహ ప్రతిష్ఠ చేసి 40 రోజులు కావడంతో పూజారులు అమ్మవారికి అభిషేకాలు, పూజలు చేపట్టారు. మహిళలు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి దీలుబోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

కంభంవారిపల్లి, న్యూస్‌టుడే : మండలంలోని తీతవగంటపల్లెలో ఆదివారం శ్రీనివాస ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో, అరబిందో ఫార్మా ఫౌండేషన్ సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 108 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వారిలో 34 మంది మహిళలకు గర్భాశయ పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శిబిరం సమన్వయకర్త శశి కుమార్ రెడ్డి, వైద్యులు, ట్రస్టు సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.





బ్యాడ్మింటన్‌లో ధ్రువతార హోత్రిశ్రీ

బ్యాట్ పడితే పతకం కొట్టాల్సిందే

జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ

● పీలేరుకు చెందిన ప్రభాకర్‌రెడ్డి బ్యాడ్మింటన్‌లో జాతీయ క్రీడాకారుడు కావడంతో చిన్నతనం నుంచి కుమార్తెను కూడా ఆ క్రీడలో అంతర్జాతీయ స్థాయి క్రీడాకారిణిగా తీర్చిదిద్దాలని ఆశించారు. కన్నవారి ఆశయం నెరవేర్చేందుకు చదువుతో పాటు బ్యాడ్మింటన్‌లోనూ తర్ఫీదు పొందుతూ జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని ప్రశంసలు అందుకుంటోంది తాటిగుట్ల హోత్రిశ్రీ. కుమార్తె లక్ష్యానికి సహకారంగా విద్యార్థిని తల్లిదండ్రులు ప్రభాకర్ రెడ్డి, లావణ్య పీలేరులో హోత్రిశ్రీ షటిల్ అకాడమిని ఏర్పాటు చేసి ఇండోర్ స్టేడియంలో పలువురికి శిక్షణ ఇస్తున్నారు. అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులైన గోపీచంద్, సైనా నెహ్వాల్, పీవీ సింధు లాంటి వారిని ఆదర్శంగా తీసుకుని రాణిస్తోంది.

హోత్రిశ్రీ... బ్యాడ్మింటన్ ధ్రువతార... పీలేరుకు చెందిన ఈ చిన్నారి మాజీ సైనికోద్యోగి, స్వతహాగా బ్యాడ్మింటన్ క్రీడాకారుడైన టి.ప్రభాకర్‌రెడ్డి కుమార్తె. తల్లి లావణ్య గృహిణి, అక్క పావనిశ్రీ డిగ్రీ చదువుతోంది. హోత్రిశ్రీ పీలేరు శ్రీకాకతీయ విద్యాసంస్థలో పదో తరగతి పూర్తి చేసుకుని ప్రస్తుతం ఇంజినీరింగ్ డిప్లొమా చదువుతోంది. హైదరాబాదులోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో భాస్కర్ నేతృత్వంలో ప్రత్యేక శిక్షణ తీసుకుని జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు. ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారులు పుల్లెల గోపీచంద్, సైనా నెహ్వాల్, పీవీ సింధులను స్ఫూర్తిగా తీసుకుని రాణిస్తోంది.

- పీలేరు, న్యూస్‌టుడే

సాధించిన విజయాలివి...

■ 2017లో హైదరాబాదు గోపీచంద్ అకాడమీలో జాతీయ స్థాయి సబ్ జూనియర్స్ బ్యాడ్మింటన్ పోటీల్లో పతకం సాధించారు.

■ 2017లో రాజమండ్రిలో అండర్-15 విభాగంలో ఆంధ్ర రాష్ట్ర సబ్ జూనియర్ బ్యాడ్మింటన్‌లో ఛాంపియన్‌షిప్ సాధించారు. ఇదే ఏడాది రాజమండ్రిలో అండర్-13 విభాగంలో ఏపీ స్టేట్ సబ్ జూనియర్స్ విభాగంలో కాంస్య పతకం సాధించారు.

■ 2018 మే 25 నుంచి 28వ తేదీ వరకు నెల్లూరులో జరిగిన అండర్-14 విభాగంలో మినీ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్పును కైవసం చేసుకున్నారు.

■ బెంగళూరులో అండర్-13 విభాగంలో జరిగిన బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతగా నిలిచారు. న్యూ దిల్లీలో త్యాగరాజ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో పీఎన్‌బీ మెట్‌లైఫ్ జేబీసీ-3 అండర్-13 విభాగంలో కాంస్య పతకం సాధించారు.

■ 2017 ఫిబ్రవరి 13న హైదరాబాదు సౌత్‌జోన్ స్థాయి పీఎన్‌బీ మెట్‌లైఫ్ జేబీసీ పోటీల్లో పాల్గొని విజేతగా నిలిచారు.

■ 2017 జులై అండర్-13 విభాగంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి ర్యాంకింగ్ టోర్నమెంట్‌లో బంగారు పతకం దక్కించుకున్నారు.

■ 2017 జులై అండర్-15 విభాగంలో రాష్ట్రస్థాయి ర్యాంకింగ్ టోర్నమెంట్‌లో కాంస్య పతకం దక్కించుకున్నారు.


రాజమహేంద్రవరంలో మంత్రి కొల్లు రవీంద్ర నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న హోత్రిశ్రీ

■ 2017 అక్టోబరులో జరిగిన అండర్-14 విభాగంలో 69 స్కూల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పోటీల్లో తలపడి రజత పతకం సొంతం చేసుకున్నారు. అదే నెలలో జరిగిన అండర్-14 విభాగంలో ఏపీ రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతగా నిలిచారు.


సింగిల్స్, డబుల్స్ విజేత హోత్రిశ్రీని అభినందిస్తున్న పీవీ సింధు (పాత చిత్రం)

2017 జులై న్యూదిల్లీలో అండర్-13 విభాగం పీఎన్‌బీ మెట్‌లైఫ్ జేబీసీ-3 గ్రాండ్ ఫైనల్‌లో రన్నరప్‌గా నిలిచారు.

■ 2018 ఏప్రిల్ 13వ తేదీ బెంగళూరులో జరిగిన సెలెక్ట్ ఆల్ ఇండియా ఓపెన్ సబ్ జూనియర్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో విజేత.

■ 2018 జూన్‌లో జరిగిన అండర్ -13 విభాగంలో పీఎన్‌బీ మెట్‌లైఫ్ జేబీసీ 4 సౌత్‌జోన్ టోర్నమెంట్‌లో విజేత.

■ 2018లో దిల్లీ, అస్సాం, మణిపూర్, ప్రొద్దుటూరు, తిరుపూర్‌లో జరిగిన అండర్-17 బ్యాడ్మింటన్ పోటీల్లో సత్తాచాటి ప్రశంసాపత్రాలతో పాటు జ్ఞాపికలు దక్కించుకుంది.

■ 2019లో ప్రొద్దుటూరు, బెంగళూరులో సౌత్ జోన్ పోటీల్లో పాల్గొన్నారు. కడపలో ఆల్‌ఇండియా బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొని ప్రశంసాపత్రాలు పొందారు. బ్యాడ్మింటన్‌లో చూపిన ప్రతిభకు 2019లో సీఎం చంద్రబాబు నుంచి అబ్దుల్ కలాం పురస్కారాన్ని అందుకున్నారు.

■ 2021లో బెంగళూరు పంజాబ్ నేషనల్ బ్యాంకు ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని విజేతగా నిలిచారు.

■ 2024 సెప్టెంబరులో కడప జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో కందుల ఓబుల్‌రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ కనబరచి చెన్నైలో జరిగే సౌత్ జోన్ పోటీలకు ఎంపికయ్యారు.

ప్రపంచ నెంబర్‌వన్ స్థానమే లక్ష్యం

తల్లిదండ్రుల ప్రోత్సాహం సంతృప్తిగా ఉంది. బ్యాడ్మింటన్‌లో ఇంకా శిక్షణ పొందుతున్నా... నిరంతరం సాధన ద్వారా ప్రపంచ నెంబర్ వన్ కావడమే నా లక్ష్యం. పీలేరులో షటిల్ బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేసి ఔత్సాహితులకు ఆటలో శిక్షణ ఇవ్వాలి. పీలేరుకు గుర్తింపు తీసుకురావాలని కృషి చేస్తున్నా. - హోత్రిశ్రీ, పీలేరు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వీరబల్లి, న్యూస్‌టుడే: సానిపాయికి చెందిన బలరామ్ (53) విషగుళికలు తిని వారం కిందట ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. కుటుంబ సభ్యులు తిరుపతిలోని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారని ఎస్సై మోహన్ నాయక్ ఆదివారం తెలిపారు. ఈ విషయంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడి బలవన్మరణం

పుల్లంపేట, న్యూస్‌టుడే: మనస్తాపానికి గురైన వృద్ధుడు బిట్టా వెంకట్రామయ్య (66) ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కొత్తపేట గ్రామానికి చెందిన బిట్టా వెంట్రామయ్య మద్యానికి బానిసయ్యారు. ఈ క్రమంలో ఆదివారం తన కుటుంబ సభ్యులకు ఆదరువుగా ఉండలేకపోతున్నానని మనస్తాపానికి గురై గ్రామ సమీపంలోని చెట్టుకు ఉరేసుకున్నారు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పైపులైన్‌కు మరమ్మతులు

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే: పురపాలక పరిధిలో గాలివీడు రోడ్డు మార్గంలో వెలిగల్లు నుంచి నీటిని సరఫరా చేసే పైపులైన్ పగిలి నీరు మొత్తం రోడ్డుపై పారుతూ వృథాగా పోతోంది. ఈ సమస్యపై ఈ నెల 5న మేమున్నాం..మీకు తోడుగా కింద చిత్ర కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు ఆదివారం పైపులైనుకు మరమ్మతులు చేశారు.



నూతన మద్యం పాలసీపై అవగాహన

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: నూతన మద్యం పాలసీపై దరఖాస్తుదారులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారి మధుసూదన్ పేర్కొన్నారు. పట్టణంలోని ఎక్సైజ్ శాఖ కార్యాలయాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. సీఐ తులసితో కలిసి కొత్త మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకున్న వారితో సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లా పరిధిలో 111 మద్యం దుకాణాలకు ఇప్పటి వరకు 231 దరఖాస్తులు అందాయన్నారు. రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె మండలాల్లో ఒక్కో దుకాణానికి రూ.65 లక్షలు, చిట్వేలి మండలంలో రూ.55 లక్షలుగా నిర్ణయించినట్లు చెప్పారు. జాతీయ రహదారికి 500 మీటర్లు, బడి, గుడి ఉన్న ప్రదేశాలకు 100 మీటర్ల దూరంలో దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. ఎస్.ఐ. వరుణ్‌కుమార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.


దరఖాస్తుదారులకు అవగాహన కల్పిస్తున్న మధుసూదన్, పక్కన సీఐ తులసి

మానవతా విలువల సాధనే ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యం

సుండుపల్లి: మానవతా విలువల సాధనే ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యమని తిరుపతి ప్రాంత సంఘ సంచాలక్ రవీంద్రనాథ్ పేర్కొన్నారు. సుండుపల్లి ఎంసీఆర్ నగర్‌లోని ఓ కల్యాణ మండపంలో మూడురోజుల నిర్వహించనున్న ప్రత్యేక శిక్షణ శిబిరం ఆదివారం ప్రారంభమైంది. సమాజానికి మనమివ్వాల్సిన మంచి ఏంటి.. సమాజం నుంచి మనం నేర్చుకోవాల్సిన మంచి ఏంటనే అంశాలపై అవగాహన కల్పించారు.

కంపుకొడుతున్నా పట్టించుకోరా..?

లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: లక్కిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీలో అభివృద్ధి ఏమాత్రం జరగట్లేదని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు ఆరోపించారు. సీపీఐ నాయకులతో కలిసి మండల కేంద్రంలోని 1వ వార్డులో దుర్వాసన వెదజల్లుతోన్న మురుగు కాలువను ఆదివారం పరిశీలించారు. ఏ వార్డు చూసినా డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందన్నారు.

ఆత్మీయ సమ్మేళనం

సుండుపల్లి: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల ఆదివారం 2003-04లో పదో తరగతి చదివిన విద్యార్థులంతా ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. అప్పటి గురువులను పిలిపించి సన్మానించారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. దివ్యాంగులైన ఈశ్వరమ్మ, రాజారెడ్డిలకు విశ్రాంత ఉపాధ్యాయుడు, ప్రస్తుత సబ్‌రిజిస్ట్రార్ కె.ఆనందరెడ్డి రూ.20 వేల వంతున ఆర్థిక సాయం అందించారు.


పుల్లంపేట : పూర్వ విద్యార్థులతో ఉపాధ్యాయులు

పుల్లంపేట: పుల్లంపేట శివపార్వతి బాలికోన్నత పాఠశాలలో ఆదివారం 2003-04 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు సమావేశమయ్యారు. పూర్వ విద్యార్థులు శివజ్యోతి, జయంతి, భాగ్యలక్ష్మి, మాధవి గురువులను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందించారు.





ఎస్సీ వర్గీకరణపై ధర్మ యుద్ధం

రాయచోటి, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణపై ధర్మయుద్ధం ప్రకటిస్తున్నామని మాల మహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ వై.సుదర్శనం, జాతీయ అధ్యక్షుడు గడ్డం నాగమునిలు పిలుపునిచ్చారు. రాయచోటిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణం నుంచి ఎన్జీవో హోం వరకు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎన్జీవోహోంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణపై 2004లో సుప్రీంకోర్టు 5 మంది జడ్జిలతో సుదీర్ఘ వాదోపవాదనలతో సుదీర్ఘంగా చర్చ సాగిందన్నారు. వర్గీకరణ చేయడానికి రాష్ట్రాలు ఏకగ్రీవ తీర్మానాలు చేసి దాన్ని పార్లమెంట్‌లో 2/3 మెజార్టీతో ఆమోదించాల్సి ఉందన్నారు. రాజ్యాంగం 341 ఆర్టికల్ ప్రకారం గాని ఆర్టికల్ 14, 16 ప్రకారం గాని వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు లింగం సంజీవ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధరణి, రాయలసీమ కన్వీనర్ యమల చంద్రయ్య, రాష్ట్ర అధికార ప్రతినిధి హరి, జిల్లా అధ్యక్షుడు చింతపర్తి శివయ్య, ఉమ్మడి కడప జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటస్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ మనోహర్, రాయలసీమ విద్యార్థి విభాగం అధ్యక్షుడు మలతోటి నరేష్, మహిళ అధ్యక్షురాలు దేవి, రవిశంకర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు సుదర్శనం, వేదికపై నాయకులు

చోరీ కేసులో అంతర్ జిల్లా దొంగ అరెస్టు

రాజంపేట, న్యూస్‌టుడే: రాజంపేట పట్టణం కృష్ణానగర్‌లో గత నెల 21న ఓ ఇంట్లో జరిగిన చోరీ కేసుకు సంబంధించి అంతర్ జిల్లా దొంగను అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ సుధాకర్‌బాబు తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఆయన వెల్లడించారు. కృష్ణానగర్‌లో నాగరాజు వ్యక్తి ఇంటిలో వేములపల్లి విజయ్‌కుమార్ అనే యువకుడు చోరీకి పాల్పడి బంగారు నగలు, నగదును తీసుకెళ్లాడు. పట్టణ సీఐ యల్లమరాజు, ఎస్‌ఐలు లక్ష్మీప్రసాద్‌రెడ్డి, నాగేశ్వరరావులు విచారణ జరిపి నిందితుడిని ఈ నెల 5న రాజంపేట రైల్వేస్టేషన్‌కి సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి రూ.6,93,800లు విలువ చేసే 138.76 గ్రాముల బంగారు, రూ.9,650లు నగదును స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ చెప్పారు. నిందితుడు విజయకుమార్‌పై వివిధ పోలీస్‌స్టేషన్లలో 41 దొంగతనం కేసులున్నట్లు చెప్పారు. గడిచిన రెండేళ్లలో సామర్లకోట పోలీస్‌స్టేషన్ పరిధిలో మూడు, రాజమండ్రి పరిధిలో రెండు కేసులు, అనపర్తి పరిధిలో రెండు, తాడేపల్లిగూడెం పరిధిలో రెండు, తణుకు, ద్వారకా తిరుమల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక్కొక్క కేసు ఉన్నట్లు వివరించారు. ఈ మేరకు కేసును త్వరగా ఛేదించిన సీఐ, ఎస్‌ఐలను డీఎస్పీ అభినందించారు.


మాట్లాడుతున్న డీఎస్పీ సుధాకర్‌బాబు. చిత్రంలో పట్టుబడిన దొంగ, స్వాధీనం చేసుకున్న నగలు

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

సుండుపల్లి, న్యూస్‌టుడే: ఏటిగడ్డరాచపల్లిలో పాలరాతితో నిర్మిస్తున్న లక్ష్మీవెంకేశ్వర ఆలయ నిర్మాణానికి రాజంపేట మందరానికి చెందిన చిన్నపరాజు కుటుంబ సభ్యులు రూ.లక్ష విరాళంగా అందజేశారని నిర్వాహకులు ఆదివారం తెలిపారు. దాతలు కువైట్ నుంచి గ్రామస్థులకు చెక్కును అందించారని చెప్పారు.


గ్రామస్థుడికి చెక్కు అందిస్తున్న చిన్నపరాజు

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి

లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని లక్కిరెడ్డిపల్లె హెల్పింగ్ బ్లడ్ క్యాంపు సంస్థ నాయకులు సలీం, మునీర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ మన రక్తం మరొకరికి ఇవ్వడం వల్ల ఆపదలో ఉన్న ఒక ప్రాణాన్ని కాపాడిన వారమవుతామన్నారు. 50 మంది యువత కర్తదానం చేశారు. ముజాహిద్, ఇంతియాజ్, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

స్థలం కబ్జా చేశారని పోలీసులకు ఫిర్యాదు

గాలివీడు, న్యూస్‌టుడే: పక్కా గృహాల స్థలంలోకి ఇతరులు ప్రవేశించకుండా అడ్డుకోవాలని కొర్లకుంట పంచాయతీ ఎస్సీ కాలనీ వాసులు పోలీసులను ఆశ్రయించారు. సకాలంలో పోలీసులు స్పందించడంతో జేసీబీ యంత్రంతో చేస్తున్న పనులను నిలిపి వేశారు. ఈ సంఘటన ఆదివారం గాలివీడు మండలంలో చోటుచేసుకుంది. కొర్లకుంట పంచాయతీ ఎస్సీ కాలనీ వాసులకు ప్రభుత్వం 1985-86లో ఆర్‌పీహెచ్ పథకం కింది సుమారు 25 మంది లబ్ధిదారులకు కస్పాకు సమీపంలో ప్రత్యేక కాలనీ ఏర్పాటు చేసింది. ఇంటి స్థలంతో పాటు పక్కా గృహాలకు నిధులు మంజూరు చేసింది. నిర్మాణాలు పూర్తయ్యాక పక్కా గృహాల్లో కొన్నేళ్ల పాటు నివాసం ఉన్నారు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన కొందరు పక్కా గృహాల సమీపంలోనా స్థలాన్ని ఆదివారం ఆక్రమించేందుకు యత్నించడంలో పోలీసులుకు ఫిర్యాదు చేయగా వారు వచ్చి అడ్డుకున్నారు.


గాలివీడు పోలీస్ స్టేషన్ వద్ద బాధితులు

రాయచోటి

• రాయచోటి • రాజంపేట • రైల్వేకోడూరు

వర్షాలు కురిపించాలని మల్లూరమ్మకు బోనాలు

చిన్నమండెం, న్యూస్‌టుడే: వండాడి గ్రామం తూర్పుపల్లి, కదిరి వాండ్లపల్లె గ్రామస్థులు మంచి వర్షాలు కురిపించాలని ఆదివారం మల్లూరమ్మ దేవతకు బోనాలు సమర్పించారు. తూర్పుపల్లి వాసులు కొత్తపల్లెలోని మల్లూరమ్మ ఆలయంలో అమ్మవారికి, కదిరివాండ్లపల్లె వాసులు గ్రామ సమీపంలోని అమ్మవారికి పరిసర ప్రాంతాల నుంచి తరలివచ్చి చీర, పసుపు, కుంకుమ, బోనాలు అమ్మవారికి సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.



మల్లూరమ్మకు బోనాలు సమర్పిస్తున్న మహిళలు

దరఖాస్తుల ఆహ్వానం

లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ సీఐ హిమబిందు పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ఆమె మాట్లాడారు. లక్కిరెడ్డిపల్లె 2, రామాపురం 2, గాలివీడు మండలానికి 3 దుకాణాలకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM to 1 PM)
రాజంపేట : 9441872651
రాయచోటి : 9703622242
రైల్వేకోడూరు : 7981695235

స్పందనకు వందనం

మురుగు తొలగించారు

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: రాజంపేట మండలం పోలి ఎస్సీ కాలనీ వద్ద ఖాళీ స్థలంలో మురుగు పేరుకుపోయింది. ఈ సమస్యపై శనివారం 'మురుగుతో సహవాసం' అనే శీర్షితో 'ఈనాడు'లో చిత్ర కథనం ప్రచురితమైంది. దీంతో ఈవోపీఆర్డీ హరిప్రసాద్‌రెడ్డి స్పందించి పారిశుద్ధ్య సిబ్బందితో మురుగును తొలగింపజేశారు. స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

?: గాలివీడు బస్టాండ్ ఆవరణలో వర్షం కురిస్తే చిత్తడిగా మారుతోంది. ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. నీటి నిల్వలు లేకుండా చేయాలి.
- కదిరిరెడ్డినాయుడు, ప్రయాణికుడు

✓ : చిత్తడి ఏర్పకుండా మట్టిని తోలించాం. వర్షం కురిస్తే నీటి నిల్వతో ప్రయాణికులు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకుంటాం. **- ధనంజయ్య, రాయచోటి ఆర్టీసీ డిపో బాధ్యుడు** - న్యూస్‌టుడే,గాలివీడు

?: నాగిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని గాంధీనగర్‌లో పట్టపగలే విద్యుత్తు దీపాలు వెలుగుతున్నాయి. సకాలంలో ఆర్పి వేసేలా చర్యలు తీసుకోవాలి.
- పఠాన్ మెహర్ ఖాన్, స్థానికుడు, గాంధీ నగర్.

✓ : గాంధీనగర్‌లోని వీధి దీపాలకు వేరే విద్యుత్తు తీగలు లేకపోవడం వల్ల వాటికి స్విచ్‌లు అమర్చలేకపోయాం. దీనిపై గ్రామ సభలో చర్చించి పంచాయతీ పరిధిలోని వీధి దీపాలకు స్విచ్‌లు అమర్చి సమస్యను పరిష్కరిస్తాం. **- జంబు సూర్యనారాయణ, నాగిరెడ్డిపల్లి సర్పంచి,**
- న్యూస్‌టుడే, నందలూరు

?: సుండుపల్లి-రాయవరం మార్గంలోని శివాజీనగర్ పరిధిలోని మారుతీనగర్ నుంచి వచ్చే మురుగు నీరు ప్రధాన రహదారిపైకి వస్తోంది. ప్రధాన రహదారికి కుడివైపు ఉన్న మురుగునీటి కాలువలోకి నీరువెళ్లేందుకు రహదారిపై గతంలో నిర్మించిన చిన్నపైపు కల్వర్టు పాడై నీరు వెళ్లేందుకు ఆటంకం ఏర్పడి రహదారిపై ప్రవహిస్తోంది. **- స్థానికులు, సుండుపల్లి**

✓ : రహదారిపైనీరు వెళ్లకుండా కాలువలోకి సక్రమంగా వెళ్లేలా శాశ్వత కల్వర్టు నిర్మాణానికి చర్యలు తీసుకుని సమస్య పరిష్కరిస్తాం. **- హెచ్.సురేష్‌బాబు, పంచాయతీ ప్రత్యేక అధికారి, సుండుపల్లి** - న్యూస్‌టుడే, సుండుపల్లి

?: రాజవీధిలో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రివేళ ఇబ్బందులు పడుతున్నాం. **- స్థానికులు, రాజావీధి, వీరబల్లి**

✓ : వీధిదీపాల మరమ్మతులకు సర్పంచికి తెలియజేసి సమస్య పరిష్కరిస్తాం. **- వరప్రసాద్, పంచాయతీ కార్యదర్శి, వీరబల్లి** - న్యూస్‌టుడే, వీరబల్లి

?: బాలాజీనగర్ నుంచి పక్కవీధిలోకి వెళ్లే రహదారి మలుపులో వ్యర్థాలతో అపరిశుభ్రంగా ఉంది. చెల్లాచెదురుగా పడి ఉన్న చెత్తను తొలగించాలి. **- స్థానికులు, సుండుపల్లి**

✓ : చెత్త తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం.
- ఎం.సురేష్‌బాబు, పంచాయతి కార్యదర్శి, సుండుపల్లి
- న్యూస్‌టుడే, సుండుపల్లి

శ్రీకృష్ణాలంకారం.. సాక్షాత్కారం

శరన్నవరాత్రుల వేడుకల్లో భాగంగా నాలుగో రోజు అమ్మవారు వివిధ అలంకరణల్లో భక్తులకు దర్శనమిచ్చారు. రాయచోటిలోని కొత్తపేటలో అమ్మవారు వనమహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. గాంధీబజార్‌లోని కన్యకాపరమేశ్వరీ, వీరభద్రాలయంలోని భద్రకాళీదేవి, ఉమామహేశ్వరాలయం, చౌడేశ్వరీ ఆలయాలలోని అమ్మవారు వివిధ అలంకరణల్లో కొలువుదీరారు. పలుచోట్ల అమ్మవారిని శ్రీకృష్ణాలంకారంలో ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు కుంకుమార్చన పూజలు చేశారు. లక్కిరెడ్డిపల్లెలో సర్వమంగళాదేవి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారిని రూ.500, రూ.200, రూ.100 నోట్లతో ప్రత్యేక మాలతో అలంకరించారు.

- న్యూస్‌టుడే, రాయచోటి క్లస్టర్ బృందం



పుల్లంపేట మారెమ్మ ఆలయంలో లలిత త్రిపుర సుందరిదేవి అలంకరణలో మారెమ్మ



రాయచోటి : పార్వతి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్న కన్యకాపరమేశ్వరీ అమ్మవారు



రైల్వేకోడూరు అమ్మవారిశాలలో పూజల్లో పాల్గొన్న మహిళలు



రైల్వేకోడూరులో వన విహారిణి రూపంలో దర్శనమిస్తున్న అమ్మవారు



చిన్నమండెం అమ్మవారిశాలలో అన్నపూర్ణదేవిగా దర్శనమిచ్చిన కన్యకా పరమేశ్వరీదేవి



వెంకట రాజంపేటలో మీనాక్షిదేవి అలంకరణతో కనకదుర్గమ్మ



రాజంపేట : శ్రీకృష్ణమూర్తి అలంకారంలో సాధుకామాక్షమ్మ అమ్మవారు

నామమాత్రంగా ప్రజాభిప్రాయ సేకరణ

రాజంపేట, న్యూస్‌టుడే: కేంద్రంలోని భాజపా ప్రభుత్వం వక్ఫ్‌బోర్డు ఆస్తులకు సంబంధించి చట్ట సవరణ బిల్లుపై నామమాత్రంగా ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతుందోని ఎంపీజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సలీంబాషా తెలిపారు. స్థానిక ఎంపీజే కార్యాలయంలో ఆదివారం సంఘ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న చట్టసవరణ వలన వక్ఫ్‌బోర్డు చట్టాన్ని నిర్వీర్యం చేస్తోందన్నారు. రూ.కోట్లు విలువ చేసే ఆస్తులకు భద్రత కరవవుతోందన్నారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా అధ్యక్షుడు జాకీర్‌హుస్సేన్, మైనార్టీ నాయకులు సయ్యద్‌గౌస్‌బాష, వాజిద్, ఆదిల్ పాల్గొన్నారు.

తీరిన తాగునీటి సమస్య

చిన్నమండెం: వండాడి గ్రామం తూర్పుపల్లిలో తాగునీటి సమస్యను మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి చొరవతో పరిష్కరించారు. తాగునీటి సమస్యను గ్రామస్థులు, మాజీ సర్పంచి వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన మంత్రి బోరు బావిని తవ్వించారు. ఆదివారం మోటారు ఏర్పాటు చేయడంతో నీరు పుష్కలంగా వస్తోందని స్థానికులు తెలిపారు.